ప్రజాశక్తి
మంగళవారం 30 మే 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఎండల తీవ్రతతో ఖరీఫ్ ఆలస్యం?

- జూన్ 10 తరువాతే రుతుపవనాల రాక
- వాతావరణ శాఖ అధికారుల అంచనా
- విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. దీంతో వర్షాలు రాక ఆలస్యమైతే ఖరీఫ్ జూన్ 10వ తేదీ వరకు ప్రారంభమయ్యే అవకాశాలు తక్కువేనని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎండల తీవ్రత పెరిగింది. వడగాల్పులు పెరిగాయి. రోహిణీ కార్తె ప్రవేశంతో 25వ తేదీ నుంచి గత ఐదు రోజులుగా జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో 44 డిగ్రీల నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. రానున్న నాలుగు రోజుల పాటు ఈ ఉష్ణోగ్రతలు 46 నుంచి 47 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రధానంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గరిష్టంగా 47 డిగ్రీలకు తగ్గకుండా ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వడగాలులు కొనసాగుతున్నాయి. వేసవి తాపం, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు పెరిగాయి. వడగాల్పుల ప్రభావం వల్ల ఉదయం 10 గంటల నుంచి ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల కల్లా రహదారులన్నీ నిర్మానుష్యంగా కన్పిస్తున్నాయి. కొంతమంది మాస్కులు, టోపీలు, గొడుగులు, ముసుగులు ధరించి బయటకు వస్తున్నారు. జనసంచారం తగ్గడంతో ఆటోలు, సిటీ సర్వీసులుఖాళీగా తిరుగుతున్నాయి.

వేసవి తీవ్రత కొనసాగుతుండటంతో రైతులు జూన్ 10వ తేదీ తరువాత వేచి ఉండక తప్పని పరిస్థితి నెలకొంది. కనీసం 10 రోజులు పాటు వర్షాలు నిరాటకంగా కొనసాగితేనే ఖరీఫ్ సేద్యానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. గుంటూరు జిల్లాలోకి జూన్ రెండో వారంలో నైరుతి రుతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పొలాల్లో వ్యర్థపదార్థాలు తొలగించి ఖరీఫ్‌కు సిద్ధం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షాలు పడితే దుక్కులు పోసేందుకు సిద్ధంగా ఉన్నారు. పల్నాడు ప్రాంతంలోని కొన్ని మండలాల్లో బోర్ల ద్వారా ముందస్తు ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం అవుతున్నారు. పత్తి, వరి పంటలను బోర్ల ద్వారా సాగుచేయనున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంకు ముందే రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే విత్తన దుకాణాల వద్దకు రైతులు వెళు

2లో

ధర్నాలో మాట్లాడుతున్న లక్ష్మీశ్వరరెడ్డి, శివనాగరాణి

ఉపాధి హామీని నిర్వీర్యం చేయొద్దు

- మరింత పటిష్టం చేసి వలసలను నివారించాలి
- కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా
- సిపిఎం, ఇతర ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - నరసరావుపేట

వలసలను నివారించి సొంతూళ్లోనే పని కల్పించాల్సిన ఉపాధి హామీ చట్టాన్ని నిబంధనల పేరుతో నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని, బడ్జెట్లో నిధులనూ తగ్గించిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణ, అలవెన్సుల పునరుద్ధరణ, కూలీల సమస్యల పరిష్కారం కోసం పల్నాడు కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు సంఘం పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. శివనాగరాణి మాట్లాడుతూ ఉపాధిహామీలో మేట్ల వ్యవస్థ ఎంతో కీలకమని, దాన్ని గ్రహించలేని కేంద్ర ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేసిందని చెప్పారు. పథకం సజావుగా సాగాలంటే మేట్ల వ్యవస్థను కొనసాగించాలన్నారు. రెండు పూటలా పని,

2లో

భార్య హత్య కేసులో ఎనిమిదేళ్ల జైలు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

భార్యపై అనుమానంతో పాటు, అదనపు కట్నం తెమ్మని భార్యను కొట్టి ఆమె మృతికి కారకుడైన వ్యక్తికి ఎనిమిదేళ్ల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ గుంటూరు 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వివిఎల్ సత్యవతి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలోని నాగేంద్ర స్వామి గుడి వీధికి చెందిన దుర్గం బాలకృష్ణకు 2017 ఫిబ్రవరి 15న చిలకలూరిపేట చాకలి బజారుకు చెందిన శివపార్వతితో పెదకాకాని శివాలయంలో వివాహమైంది. ఆ వివాహ సమయంలో శివపార్వతి తల్లిదండ్రులు రూ.90 వేలు నగదు ఇచ్చారు. అయితే కొద్ది రోజులకే కట్నం చాలలేదని తండ్రి శివన్నారాయణ, బాబాయ్ సీతా రామయ్య, పిన్ని రమాదేవి ప్రోద్భలంతో భార్యను బాలకృష్ణ వేధించటం ప్రారంభించాడు. దీనికితోడు పెళ్లయిన 10 రోజులకే బాలకృష్ణ తన భార్యపై అనమానం పెంచుకుని ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. 2017 మే 14 న రాత్రి బాలకృష్ణ తాను తాపీ పని చేసేటప్పుడు వాడే మూల మట్టంతో తన భార్యను కొట్టాడు. తీవ్ర గాయాల పాలైన ఆమెను బంధువులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చగా ఆమె 21న మృతి చెందింది. దీనిపై మృతురాలి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదుతో బాలకృష్ణ, అతని తండ్రి శివన్నారాయణ, బాబాయ్ సీతారామయ్య, పిన్ని రమాదేవిపై తాడికొండ పోలీసులు కేసు నమోదు

2లో

8 మంది ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల పట్టాలు

ప్రజాశక్తి- నరసరావుపేట

పల్నాడు జిల్లాకేంద్రమైన నరసరావుపేట పట్టణ పరిధిలో 8 మంది ట్రాన్స్ జెండర్లకు ఇంటి పట్టాలను జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోమవారం అందించారు. ట్రాన్స్ జెండర్లు దశాబ్దాల తరబడి సొంతిల్లు లేక, అద్దె ఇళ్లు దొరక్క, దొరికినా

2లో

పట్టాలందుకున్న ట్రాన్స్‌జెండర్స్‌తో జెసి

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు, ముసుగులో నిందితుడు

హత్యకేసులో తండ్రి అరెస్టు

ప్రజాశక్తి-నకరికల్లు

కుమారుని హత్య కేసులో నిందితుణ్ణి పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలను సత్తెనపల్లి రూరల్ సిఐ సిహెచ్.కోటేశ్వరరావు సోమవారం వెల్లడించారు. గుండ్లపల్లిలో ఈనెల 25న కుమారుణ్ణి తండ్రి హత్య చేసి కొడుకు తలను సంచిలో వేసుకుని గ్రామంలో సంచరించిన విషయం తెలిసిందే. బత్తుల కిషోర్ అలియాస్ అశోక్ మద్యం కోసం తన తండ్రి వీరయ్యతో తరచూ గొడవ పెట్టుకునేవాడని, తాగిన మైకంలో కొడుపుపై ఆగ్రహానికి గురైన తండ్రి విచక్షణ కోల్పోయి తల నరికేశాడని సిఐ తెలిపారు. నిందితుణ్ణి సోమవారం ఉదయం 11 గంటలకు నకరికల్లులోని వై జంక్షన్ వద్ద అరెస్టు చేశామని, హత్యకు ఉపయోగించిన కొడవవలిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుణ్ణి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులివ్వాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు - ప్రజలందర్నీ కదిలించి పోరాటాలకు సంఘాల పిలుపు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు వెంటనే నిధులు కేటాయించకుంటే దశల వారీగా ఆందోళనకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హెచ్చరించారు. నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని అక్షయ విద్యాలయంలో గుంటూరు ఛానల్ సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి రైతు నాయకులు కె.హరిబాబు అధ్యక్షత వహించగా లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌ను పొడిగిస్తే ఈ ప్రాంతలో వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, పర్చూరు మండలాల్లో 50 గ్రామాలకు చెందిన 50 వేల ఎకరాల భూములుకు సాగునీరు అందడమే

2లో

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

మొదటి పేజీ తరువాయి

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులివ్వాలి

తాగునీరూ లభిస్తుందని వివరించారు. ప్రస్తుతం వర్షాధారంగా సాగు చేయడం వల్ల వ్యవసాయంలో నష్టాలు, ఎగుడుదిగుళ్లు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి భూ సేకరణకు రూ.113 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూసేకరణకు గుంటూరు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చినా నిధులు విడుదల చేయక పనులు ప్రారంభం కాలేదన్నారు. బాపట్ల జిల్లా కలెక్టర్ పర్చూరు మండలానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. 1936 నుండి పెదనందిపాడు హైలెవల్ ఛానల్ నిర్మించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని పాలక పార్టీలు వాగ్దానం చేస్తూనే ఉన్నాయని, 1946లో బ్రిటిష్ ప్రభుత్వం ప్లాన్ తయారు చేసిందని గుర్తు చేశారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబునాయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గుంటూరు ఛానల్ పొడిగింపుకు నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేసినా ఫలితం లేదన్నారు. ఆ ప్రాంత ప్రజలంతా ఐక్యంగా ఉద్యమిస్తేనే ప్రభుత్వంలో కదలిక వస్తుందన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ నాటి కమ్యూనిస్టు నాయకులు కొల్లా వెంకయ్య కృషితో నల్లమడ రైతు సంఘం నాయకత్వంలో రాజకీయాలతో నిమిత్తం లేకుండా దశల వారీగా ఐక్య ఉద్యమాలు చేయడం ద్వారా గుంటూరు ఛానల్ పొడిగింపు చర్చ విస్తృతంగా జరిగిందని చెప్పారు. ఈ ఐదు మండలాల్లోని ప్రజలను పెద్దఎత్తున కదిలించి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పోరాటాల్లో రైతు సంఘం ముందు పీఠిన ఉంటుందని చెప్పారు. సమావేశంలో మాజీ ఎంపిపి ఎన్.బాలకృష్ణ, ఎన్.ఆచారి, జిడిసిసిబి మాజీ వైస్ చైర్మన్ కె.సుబ్బారెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, వివిధ సంఘాల నాయకులు కె.ఆదినారాయణ, బి.శంకరయ్య, ఎల్.అంకమ్మ చౌదరి, వేణు, కె.నాగేశ్వరావు, సాంబశివరావు, బి.లక్ష్మణరావు, సిహెచ్.రమేష్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేయొద్దు

బయోమెట్రిక్, ఆధార్ అనుసంధానం, తదితర నిబంధనలు కూలీలను అవస్థ పాల్జేయడానికేనని విమర్శించారు. తాగునీరు, పనిముట్లకు అలవెన్సులు, వేసవి అలవెన్సులు రద్దు చేయడం దుర్మార్గమన్నారు. ఉపాధి హామీ చట్టం అమలు తర్వాత వలసలు తగ్గాయని గుర్తు చేశారు. పల్నాడు జిల్లాలో వ్యవసాయం గిట్టుబాటుగాక లక్షలాది ఎకరాలు పడావుగా మారుతుంటే, రియల్ ఎస్టేట్ వెంచర్ల పేరుతో లక్షలాది ఎకరాలను ఇళ్ల స్థలాలుగా మారుస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో పెరిగిన యాంత్రికరణ పెరిగి కూలీలకు పనులు తగ్గాయని, ఈ నేపథ్యంలో ఉపాధి హామీ అవసరం కూలీలకు మరింత పెరిగిందని వివరించారు. ఎన్ఎంఎంఎస్ యాప్ వలన రద్దయిన జాబ్ కార్డులను పునరురద్ధరించడంతోపాటు కేంద్ర బడ్జెట్‌లో రూ.3 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ పట్టణాల్లో చిన్నచిన్న పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న నిరుపేదలకు కూడా ఉపాధి హామీని విస్తరించాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించి రూ.600 కనీస కూలివ్వాలని కోరారు. ధర్నాకు మద్దతుగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో వామపక్ష పార్టీల ఒత్తిడితో ఈ చట్టం వచ్చిందని తెలిపారు. దీనిద్వారా గ్రామాల్లోని డొంక రోడ్లు, పంట కాల్వలు, నీటి కుంటలు తదితర ప్రజా ఉపయోగకరమైన పనులు జరగడంతోపాటు ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని చెప్పారు. దీని ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించి మరింత పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ధర్నాలో నాయకులు డి.శివకుమారి, వై.రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు, కె.రామారావు, వివిధ సంఘాల నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో ఎనిమిదేళ్ల జైలు

చేశారు. గుంటూరు నార్త్ డీఎస్పీ జి.రామాంజనేయులు కేసు దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జ్‌షీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్స్ తరపున డిప్యూటీ డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (ఎపిపి) పాతూరి మధుసూదనరావు వాదించారు.

విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు

ఇసుకను తవ్వుతున్న పొక్లెయినర్.. కొండ వద్ద ఇసుక గుట్టలు

నదిలో ఇసుక గుంతలు, పరిమితికి మించిన లోడుతో లారీ

ప్రజాశక్తి - అమరావతి

కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అనుమతులు ఇచ్చిన క్యూబిక్ మీటర్ల కంటే అధిక మొత్తంలో తవ్వి డంపింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వైకుంఠపురం రీచ్‌లో 7.041 హెక్టార్లలో 75 వేల క్యూబిక్ మీటర్ల త్వకానికి అనుమతి. ఉంది. అదికూడా ఇసుకను పడవల ద్వారా ఒడ్డుకు చేర్చి అక్కడి నుండి లారీల్లో రవాణా చేసుకోవాల్సి ఉంది. అయితే ఇవేమీ ఈ రీచ్‌లో అమలు కావడం లేదు. నదిలోనే ప్రత్యేకంగా దారిని వేసి లారీలను పోనిస్తున్నారు. అక్కడ పెద్ద యంత్రాల ద్వారా పరిమితికి మించి నాలుగింతలు అధికంగా ఇసుకను లారీల్లో లోడ్ చేసి దాన్ని గ్రామంలోని పంప్‌హౌస్ సమీపంలోని కొండ వద్ద భారీగా డంప్ చేస్తున్నారు. మరోవైపు పరిమితికి మించిన లోడుతో లారీలు గ్రామాల్లో రేయింబవళ్లు తిరుగుతుండడంతో రహదార్లు పాడవుతున్నాయని, వాహనాల రొదను తట్టుకోలేకపోతున్నామని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం లారీలో 20 టన్నుల ఇసుకనే రవాణా చేయాల్సి ఉన్నా ట్రక్కు పైదాక 45 టన్నుల వరకూ వేస్తున్నారని, దీంతో రోడ్లన్నీ పాడవుతున్నాయని అంటున్నారు. పైగా ఒక బిల్లుతో రెండుమూడు సార్లు తిరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా రీచ్‌లకు కాలపరిమితి ముగిసిందనే వాదనలూ వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, ఇసుక తవ్వకాలు, తరలింపుపై పారదర్శకంగా బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు నిబంధనలు మీరకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. నదీ గర్భంలో అధిక తవ్వకాల వల్ల భూకంపాలు, ఇతర ఉపద్రవాలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతల్లో పడి పలువురు మృత్యువాత పడుతున్నారు. గత ఐదు నెలల వ్యవధిలో నాలుగు ఘటనల్లోనే ఐదుగురు మృత్యువాత పడ్డారు.

చంద్రబాబు చిత్రపటానికి తెలుగు మహిళ పాలాభిషేకం

ప్రజాశక్తి - నరసరావుపేట

మహానాడులో మహిళలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ఆర్థిక వెసులుబాటు, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, తల్లికి వందనం అంటూ మ్యానిఫెస్టో విడుదల చేసిన నేపథ్యంలో మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి మానుకొండ జాహ్నవి అన్నారు. ఈ సందర్భంగా మానుకొండ జాహ్నవి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం ఎదుట చంద్ర బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జాహ్నవి మాట్లాడుతూ ఆస్తిలో వాటా కల్పించిన ఘనత ఎన్‌టిఆర్‌కు దక్కిందని, టిడిపి ఆవిర్భావం నుండి మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపుకోసం మహిళలు కీలకంగా వ్యవహరించాలని, డాక్టర్ అరవిందబాబుకు మద్దతుగా నిలవాలని కోరారు.

పోర్టిఫైడ్ బియ్యంపై అపోహలొద్దు

ప్రజాశక్తి-తాడేపల్లి

బలవర్ధక బియ్యం (పోర్టిఫైడ్) వినియోగంలో అపోహలొద్దని ఎఫ్‌సిఐ తాడేపల్లి కృష్ణా కెనాల్ డిపో మేనేజర్ జి.సుకుమార్ చెప్పారు. సోమవారం పట్టణంలోని అంజిరెడ్డి కాలనీతో పాటు పనలు కాలనీల్లో ఎఫ్‌సిఐ బృందం పర్యటించి పోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పించారు. దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాళ్లలో ఒక్కటైన ఆహార లోపాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం పోర్టిఫైడ్ రైస్ ప్రవేశపెట్టిందన్నారు. దీనివల్ల రక్తహీనత, సూక్ష్మ పోషకాల లోపాన్ని నివారించవచ్చని చెప్పారు. మేనేజర్ ఇ.రాంప్రసాద్ మాట్లాడుతూ పిల్లలు, బాలింతులు, గర్భినులకు కావాల్సిన ఐరన్, ఫోలిక్ ఆమ్లం,

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

విటమిన్ బి12ను పోర్టిఫికేషన్ పద్ధతిలో బియ్యానికి జోడించడం వల్ల ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంఎస్ శశికళ, డిపో మేనేజర్ వర్గిస్ పాల్గొన్నారు.

ఎండల తీవ్రతతో ఖరీఫ్ ఆలస్యం?

_న్నారు. ఆగస్టు నుంచి సాగు చేయాల్సిన మిర్చి విత్తనాలను ఇప్పటికే కొంత మంది రైతులు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. మిర్చి కంపెనీల బ్లాక్ మార్కెట్‌పై దృష్టిసారించాలని ప్రజా ప్రతినిధులు ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను కోరారు. పత్తి, వరి, మిర్చి విత్తనాల కొనుగోలుపై ఎక్కువ మంది రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఆర్‌బికేల ద్వారా అన్ని రకాల విత్తనాలను సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. తొలకరి పంటలుగా గ్రీన్ మెన్యూర్ విత్తనాలు (పచ్చిరొట్ట) విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు ఇప్పటికే ఆర్‌బికేల్లో అందుబాటులో ఉంచామని, రైతులు 50 శాతం సబ్సిడీతో తీసుకోవచ్చునని తెలిపారు.

8 మంది ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల పట్టాలు

అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల స్థలాల కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో గతవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ స్థలం మంజూరు, ఇంటి నిర్మాణానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో 8 మందికి ఇక్కుర్రు లేఔట్‌లో పట్టాలను అందించారు. వీటిని పొందినవారిలో జి.ఎల్లమ్మ, షేక్ బాషా, జె.రెడ్డి, శ్రీను నాయక్, చౌడయ్య, సదాశివ, ప్రభుదాసు, ఉష ఉన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఇతర అధికారులు పాల్గొన్నారు

నేడు వైసిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, రక్తదానం

ప్రజాశక్తి - నరసరావుపేట : ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయం నుండి లింగంగుంట డాక్టర్ వైఎస్ఆర్ జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ వరకు నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ, అనంతరం కేక్ కటింగ్, రక్తదానం, రోగులకు పండ్లు పంపిణీ ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిసింది.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

- పరిశ్రమల శాఖ కార్యదర్శి సునీత సూచన
- రైతులకు ప్రశంసా పత్రాలు అందచేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక కాటన్ అసోసియేషన్ హాలులో సోమవారం జరిగిన రైతు సదస్సులో పలువురు రైతులకు పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి కె. సునీత ప్రశంసాపత్రాలు అంద చేశారు. సదస్సుకు ఎపి కాటన్ అసోసి యేషన్, ఎపి టెక్స్‌టైల్ మిల్స్ అసో సియేషన్, ఎపి కాటన్ సీడ్స్ క్రషర్స్ అసో సియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సద స్సులో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కాటన్ అసోసియేషన్ అధ్యక్షులు పి.రాఘవ రావు అధ్యక్షత వహించారు. పత్తిలో సమగ్ర యాజమాన్య రైతు ప్రదర్శనా క్షేత్రాల ద్వారా అధిక దిగుబడి సాధించిన రైతులు సామినేని దుర్గారావు(పరిటాల), ప్రభాకరరావు (ఆతుకూరు), షేక్ సుభాని (బేజాత్‌పురం) ఆచ్చాల వెంకటేశ్వర్లు(దాచేపల్లి), ఆచ్చాల నాగేశ్వరరావు(దాచేపల్లి), తాడిపర్తి కోటిరెడ్డి, మునగా స్వామి తదితరులను ఆమె అభినందించారు. ఈ మూడు అసోసియేషన్‌లతోపాటు వ్యవసాయశాఖ అధికారుల సహకారంతో కృష్ణా జిల్లా పరిటాల,గుంటూరుజిల్లా బేజాత్పురం, పల్నాడుజిల్లా దాచేపల్లి, లింగారావుపాలెం గ్రామాల్లో వేర్వేరుగా 100 ఎకరాల్లో నాలుగు చోట్ల పత్తిసాగు చేసి అధిక దిగుబడులు సాధించిన రైతులను ఆమె అభినందించారు. సాధారణంగా 5 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా ఈ ప్లాంట్ల ద్వారా 20 క్వింటాళ్ల దిగుబడి సాధించడం ముదావాహం అన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించాలని రైతులకు సునీత సూచించారు. ద్వారా నాణ్యమైనపత్తి మార్కెట్‌లోకి తీసుకురావడం వల్ల ధరలుకూడా బాగా వస్తాయన్నారు. ఆదర్శరైతు మేకల లక్ష్మీనారాయణ, ఎపి టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు రఘురామిరెడ్డి, ఎపి కాటన్ సీడ్స్ క్రషర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్, టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ కార్యదర్శి సామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

పరారీలో ఉన్న నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-తెనాలి

పేకాట కేసులో నిందితులుగా ఉండి పరారీలో ఉన్న వారిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు సోమవారం వెల్లడించిన వివరాల ప్రకారం గత ఏడాది జూన్ 23న పేకాట శిబిరం పై దాడి చేసి, నింది తులపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న కఠెవరం గ్రామానికి చెందిన లంకే అజయ్ కుమార్. కొండ లక్ష్మీనారాయణను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పర చగా నిందితులకు న్యాయమూర్తి 8 రోజులు రిమాండ్ విధిం చినట్లు ఎస్ఐ తెలిపారు. గతంలో నమోదైన కేసులో కొంద రిని అప్పట్లోనే అరెస్టు చేశామన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బాలాజీ రావు పేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు వెల్లడించిన వివరాలు ప్రకారం పాలమూరు కృష్ణకుమార్ గుంటూరు జిల్లా కోర్టులో ఉద్యోగి. స్థానిక బాలాజీ రావు పేటలో అద్దెకు ఉంటున్నాడు. శని వారం కుటుంబంతో కలిసి ఊరెళ్ళారు. అదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరు వాలో ఉన్న వెండి వస్తువులు, బంగారం, నగదు అప హరిం చారు. ఆదివారం ఉదయం తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన ఇంటి యజమాని, కృష్ణకుమార్ కు ఫోన్ లో సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చిన కృష్ణ కుమా ర్ ఇంట్లో చిందరవందరగా ఉన్న బీరువాలు, వస్తువులను చూసి దొంగతనం జరిగినట్లు గమనించి త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారణ చేపట్టారు.

సెంట్రింగ్ షాపులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థాయిక గడియారం స్థంభం వద్ద అన్న క్యాంటీన్ వెనుక ఉన్న సెంట్రింగ్ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రూ.1.5 లక్షల వరకు సెంట్రింగ్ సామాను కాలిపోయాయని సెంట్రింగ్ షాపు యజమాని తెలిపారు. విషయం తెలియగానే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. మంటలు పక్క షాపులకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నామని సిబ్బంది వెంకయ్య తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ఎలుకల మందు తిన్న మహళ మృతి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

భార్యాభర్తల మనస్పర్థలతో భార్య ఎలుకల మందు తిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ప్రత్తిపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు మండల కేంద్ర ంలో నివసిస్తున్న కుంచాలనాగమ్మ(62) ఆమె భర్త సుబ్బారావుకి మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలు తలెత్తి తన చిన్న కుమారుడు కుంచాల ఏసుబాబు ఇంట్లో ఉంటుంది. భర్తతో వచ్చిన స్పర్థలు గురించి ఆలోచిస్తూ వికలత చెందిన 26వ తేదీన ఎలుకల మందు నీళ్లలో కలుపుకుని తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజాములు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె కుమారుడు ఏసుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానాయకుడు తెలిపారు.

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు ధ్వంసం

ప్రజాశక్తి - నరసరావుపేట

రొంపిచర్ల మండలంలోని సుబ్బయ్యపాలెం గ్రామంలో చిరుమామిళ్ల శ్రీనివాసరావుకు ఊరి శివారు ప్రాంతంలో పశువుల పాక ఉంది. సోమవారం సాయంత్రం చిరుజల్లులతో పాటు పాక దగ్గర ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు సగం మేరకు చీలి కూలిపోయింది. సమీపంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

నాపరాయి లోడు ప్రమాదంలో మరొకరు మృతి

ప్రజాశక్తి - రెంటచింతల

బాపట్ల జిల్లా రేపల్లె సమీపంలోని రావిఅనంతవరం వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఈ ప్రమాదంలో ఇప్పటికే పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పసర్లపాడుకు చెందిన నాపరాయి కార్మికులు పఠాన్ వలి, చింతమల్ల చెన్నకేశవ, కొనకంచి సాంబశివరావు మృతి చెందారు. ఇదే ప్రమాదంలో మరో ముగ్గురు గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుడిపూడి సుబ్బయ్య (60) సోమవారం మృతి చెందారు. మృతునికి భార్య, ఐగులురు పిల్లలు కాగా వారందరికీ వివాహాలయ్యాయి.

ఓర్వలేక టిడిపి విమర్శలు : మేయర్ కావటి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

అమరావతిలో ఆర్5జోన్ పరిధిలో 50 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే ఓర్వలేక టిడిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. సోమవారం

వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద ఆయన ప్రారంభించారు. జగన్మోహన్ రెడ్డి ఎంత ప్రతిష్టాత్మకంగా అమరావతి ఆర్ 5 జోన్‌లో సొంత గహాలు లేని నీరు పేద ప్రజలకు 50వేల పైగా ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తున్న నేపథ్యంలో భూస్వాములు, టిడిపి నాయకులు సిఎంపై విమర్శలు చేయడం తగదన్నారు. టిడిపి హయంలో రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా మాస్టర్ ముసుగులో అన్ని తరగతుల వారిని మభ్యపెట్టారని అన్నారు. పేదలకు చోటు లేకుండా అమరావతి అభివృద్ధి జరగదన్నారు. వైసిపిజిల్లా అధ్యక్షులు డొక్కామాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి ఇళ్లు కూడానిర్మించి ఇస్తుంటే ఓర్వలేక టిడిపి విమర్శలు చేస్తుందన్నారు. సిఎంపై అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో టిడిపి తరుపున విడుదల చేసిన మేనిఫెస్టోలో బిసిలకు,మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడాన్ని హర్షిస్తూ సోమవారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఫోటోకు పాలాభిషేకం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కనపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ర

మ్యాజిక్ అప్‌డేట్‌లపై నిత్య సమచారం

ప్రజాశక్తి-తాడేపల్లి

మ్యాజిక్ ఓ ట్రిక్ అని, దానిని మేజీషియన్లు రహస్యంగా ఉంచుకోవాలని ప్రముఖ ఇంద్రజాలికులు క్రాంతికార్ తెలిపారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 17వ తేదీ వరకు అరవింద హైస్కూలో జరిగిన మ్యాజిక్ సమ్మర్ శిక్షణా శిబిరంలో కొన్ని మెళకువలను, కొన్ని ఐటమ్స్‌ను సోమవారం తాడేపల్లిలోని రవీంద్రభారతి హైస్కూల్లో అందజేసి మాట్లాడారు. బాల మేజిషియన్లు అందరూ మ్యాజిక్ బాగా నేర్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.

ఇందుకోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రూపులో వారానికి ఒకసారి ప్రపంచ, దేశ్యాప్తంగా జరిగే మ్యాజిక్‌లో కొత్త విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంపిడిఒ ఆదినారాయణ, జి.పిచ్చయ్య, బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

2 నుంచి పదో తరగతి అడ్వాన్స్ పరీక్షలు

ప్రజాశక్తి - రెంటచింతల

పదో తరగతి అడ్వాన్స్ పరీక్షలు జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు ఉదయం 9:30 నుంచి 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి అన్నారు. జూన్ 2న తెలుగు, 3న హిందీ, 5న ఇంగ్లీషు, 6న గణితం, 7న సైన్సు, 8న సోషలు, 9న ఫస్ట్ లాంగ్వేజ్ కాం పోజిట్,10 తేదీన మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 2 పరిక్షలు ఉంటాయన్నారు మం డల కేంద్రమైన రెంటచింత లలో సెంట్ జోసెఫ్ హైస్కూలులో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, TENALI
I.A.No. /2023 in O.S.No.159/2023

Between:
Bank of India, Chenchupet Branch, Tenali
Rep. by its Senior Branch Manager
...Petitioner/Plaintiff
And
Shaik Nagur Vali, S/o. Khasim, aged about 28 years, Occ:Goldsmith, D.No.18-8-43, Hindu Musilm Road, Salipet, Tenali
...Respondent/Defendant

NOTICE

పై నెంబరు దావాలో ఓ.యస్.నెం.159/2023 మీకు కోర్టు ద్వారాను, రిజిష్టర్డు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు చేయించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా కోర్టు వారు ఆర్డరు వేస్తూ ది.16-06-2023న వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు అనగా ది.16-06-2023న ఉదయం గం.10-30 నిమిషములకు మీరు స్వయంగా గానీ, మీ తరుపున లాయరు గారి ద్వారా గానీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావా మరియు పైన తెల్పిన పిటీషనులో మీ పరోక్షమున విచారించి, తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా తేది:16-06-2023
తెనాలి,
తేది:29-05-2023

గొరికపూడి బాబూరావు,
వాది తరుపున న్యాయవాది, తెనాలి.
సెల్.నెం.9440740044.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన చిన్నం కృష్ణ ప్రసాద్ తండ్రి. చిన్నం రామయ్య చౌదరి (లేటు), సెల్.నెం.7095696789. డోర్.నెం.3-1-3, 4వ లైను, రాజేంద్రనగర్, గుంటూరు సిటీ, గుంటూరు కాపురస్తులు అను వారు నుండి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ చిన్నం కృష్ణప్రసాద్ గుంటూరు డి॥ నల్లపాడు సబ్ డి॥ పెదపలకలూరు గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన పెదపలకలూరు డి.నెం:379రూ. లోని ప్లాటు నెం:2/బి పెదపలకలూరు రోడ్డులోని, 300చ.గ లోని స్థలంను యడ్లపల్లి స్వాతి గారి తరుపున నుండి G.P.A గా ది:-10-03-2008వ ద.సా నెం.1112/2008 SRO గుంటూరు వారి కార్యాలయం నందు నాక్లయింటు పేరున G.P.A తో కూడిన విక్రయ అగ్రిమెంటు దస్తావేజు గా రిజిష్టరు చేసి ఉన్నారు. సదరు విక్రయ అగ్రిమెంటు దస్తావేజునకు లింకు దస్తావేజు అనగా ద.నెం.1925/1992 ది:05-03-1992 SRO గుంటూరు పొయినది అని నా క్లయింటు Principal గారు అయిన యడ్లపల్లి స్వాతి గారి ద్వారా తెలియవచ్చినది. దరిమీలా సదరు యడ్లపల్లి స్వాతి గారి G.P.A Holder అయిన నేను అనగా చిన్నం కృష్ణప్రసాద్ కు Original Link ద.నెం.1925/1992 గురించి తగు చర్యలు తీసుకునే భాగంగా, అనగా పొలీసు వారి నుండి not traced certificate మరియు Paper publication మొదలగునవి చేయుచున్నాను. నేటికి అవి అవసరమగుట చేత ఈ Paper publication నా క్లయింటు ద్వారా ఇచ్చుచున్నాను. కనుక సదరు Original Link ద.నెం:-1925/1992 ది.05-03-1992 నా క్లయింట్ ని సంభందించినవి కనుక, అవి ఎవరికైన దొరికిన, నా క్లయింట్‌కి అందచేయవలయును. సదరు లింకు దస్తావేజు పై నా క్లయింటు అమ్మిన వారికి తప్ప ఎవరికి ఎటువంటి అధికారములు లేవు. ఎవరైనా అన్యక్రాంతం చేయదలచినా చట్టరిత్యా భాద్యులు అవుదురు. కావున తెలియపరచటమైనది.

K.V.Srirama Subbarao,
Advocate, 6/4 Arundalpet,
Guntur.9849187315.

మా భూమి మాకు కాకుండా చేశారు!

జగనన్నకు చెబుదాంకు కబ్జాలు, భూ వివాదాలపై అధికంగా ఫిర్యాదులు - వివిధ సమస్యలపై 170 వినతులు రాక

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంబాబు

క్లిష్టమైన ఆపరేషన్లూ చేయాలి : మంత్రి

ప్రజాశకి-సత్తెనపల్లి టౌన్

ఎంత క్లిష్టమైన కాన్పులైనా, ఆపరేషన్లు అయినా స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేసేలా వైద్య సేవలను మెరుగుపర్చాలని, వైద్యులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూచించారు. స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యులను పూర్తి స్థాయిలో నియమించామని, వసతులూ కల్పించామని చెప్పారు. ఇకపై సేవలను అదే స్థాయికి తీసుకెళ్లాలన్నారు. మెరుగైన వైద్యసేవలు అందించడానికి వైద్యులు, సిబ్బంది సంయుక్తంగా కృషి చేసి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. కంటి చికిత్సల కోసం ఆపరేషన్ థియేటర్‌ను త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ లక్ష్మణరావు, అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నూతన ఎఎస్‌పి

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా క్రైమ్ అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌కె చంద్రశేఖర్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా చంద్రశేఖర్ ఇక్కడ నియమి తులయ్యారు.

ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్.కె చంద్రశేఖర్

అనంతపురం జిల్లా కనేకల్లు మండలానికి చెందిన చంద్రశేఖర్ 1989 బ్యాచ్‌లో ఎస్ఐగా సర్వీసు ప్రారంభించి అనంతరం సిఐగా, డీఎస్పీగా ప్రమోషన్ పొందారు. ఇంటెలిజెన్స్ విభాగంలో, కడపలో స్పెషల్ ప్రాంబచ్‌లో, ఏసీబీలో రేణిగుంట డీఎస్పీగా, తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌లో ఈయన పని చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇళ్లల్లో చోరీల నివారణకు బృందాలను ఏర్పాటు చేయాలని, చోరీ కేసుల్లో నిందితులను త్వరగా అరెస్టు చేసి సొత్తును రికవరీ చేయాలని ఎస్పీ సూచించారు. జైలు నుండి విడుదలైన ముద్దాయిల కదలికలపై నిరంతర నిఘా పెట్టాలన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న జెసి శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - నరసరావుపేట

కలెక్టరేట్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందన హాలులో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజల నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డిఆర్ఒ వినాయకం, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు ఫిర్యాదుల స్వీకరించారు. 170 అర్జీలు రాగా వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను జెసి ఆదేశించారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి రెడ్‌క్రాస్ ఆద్వర్యంలో వైవిఆర్ ఫౌండేషన్ వెంకటరత్నం ద్వారా భోజనాన్ని సమకూర్చారు. జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ప్రజలకు అవసరమైన ఆహార పదార్థాలు, వస్తువుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

స్వయం ఉపాధికి రుణం కోసం వినతి

స్వయం ఉపాధి పొందడానికి చెప్పుల దుకాణం పెట్టుకునేందుకు 'నవోదయం' కార్యక్రమానికి మార్చినెలలో దరఖాస్తు చేసుకున్నానని, ఇంత వరకు తనకు సమాచారం ఏమీ రాలేదని సత్తెనపల్లి మండలం నందిగం గ్రామంలోని కొండనాగార్జున నగర్‌కు చెందిన వికలాంగుడు వసుకుల మరియదాసు తెలిపారు. దుకాణం ఏర్పాటుకు రూ.5 లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

కమ్యూనిటీ భవన స్థలం కబ్జాపై ఫిర్యాదు

మాచర్ల మండలం రాయవరంలో 13 ఎకరాల్లో 1990లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు 3 సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇచ్చారని స్థానికులు తెలిపారు. 1996లో టిడిపి ప్రభుత్వం దీన్ని 2.5 సెంట్లకు కుదించి 245 మందికి పట్టాలిచ్చిం కాలనీని అభివృద్ధి చేసిందని, కమ్యూనిటి హాల్, భవిష్యత్ అవసరాల దష్ట్యా 20 సెంట్లను ఖాళీగా ఉంచగా దాన్ని పెత్తందార్లు ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. ఆక్రమణలో నిర్మాణాలూ చేపట్టారని, ప్రశ్నిస్తే దుర్భాషలాడి బెదిరిస్తున్నారని చెప్పారు. దీనిపై గతంలోనే ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ చేశారని, నిర్మాణాల నిలిపివేతకు ఆదేశాలిచ్చానరి, అయినా ఉప్పలపాటి దాసు, చామకూర ప్రభాకర్‌రెడ్డి నిర్మాణాలు కొనసాగిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని కబ్జా నుండి స్థలాన్ని విడిపించాలని కోరారు.

టిడ్కో గృహాల విషయంలో కోర్టు ధిక్కరణ

టిడ్కో గృహాలను అర్హులకు కాకుండా వైసిపి కార్యకర్తలకు మంజూరు చేశారని, దీనిపై హైకోర్టులో కేసు నడుస్తుండగా వైసిపి అనుయాయులకు ఎలా ఇస్తారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రశ్నించారు. ఈ గృహాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారులకు కోర్టు ధిక్కరణ కింద నోటీసులివ్వాలని ఫిర్యాదులో కోరారు. టిడ్కో గృహాల లబ్ధిదారుల వివరాలను మారుస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వైసిపి నాయకులపై కోర్టులో కేసు వేశామని, టిడ్కో గృహాలను నిలుపుదల చేయాలని కోర్టు గతంలో స్టే ఇచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పి.రామిరెడ్డి, సిహెచ్.బాలు, పి.రాయప్ప, సుభాని, సత్యనారాయణ పాల్గొన్నారు.

మా భూమికి పట్టాలివ్వండి

1969లో కొలగాని వీరాస్వామి అనే వ్యక్తి వద్ద తన తండ్రి 55 సెంట్ల పొలాన్ని కొన్నారని, అప్పటి నుండి ఇప్పటి వరకు భూమిని తాము సాగు చేసుకుంటున్నామని ఈపూరు మండలం బొగ్గరానికి చెందిన బి.ఆంజనేయరాజు చెప్పారు. అయితే ఇటీవల రీ సర్వే చేసిన అధికారులు తమ భూమిని ప్రభుత్వ భూమి అని ఖాళీ చేయాలని చెప్పారని, చుక్కల భూమి జాబితాలో తమ భూమి చేరిందని, న్యాయం చేయాలని ఏళ్ల తరబడి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారానికి నోచలేదని చెప్పారు. ఆ భూమిని తమకే కేటాయించి పట్టా ఇవ్వాలని కోరారు.

మా పొలాన్ని కలిపేసుకున్నారు

తమ సాగు భూమి ప్రక్కనే సమాన భూమి కలిగిన పిట్టల నాగాంజనేయులు సమీపంలో కొంత పోరంబోకు భూమిని కలుపుకొని ఎక్కువ విస్తీర్ణం తన పొలం యొక్క సర్వే నంబరులో కలుపుకొని కొంత భూమిని విక్రయించి ఇపుడు తమ భూమి తగ్గిందంటూ తన భూమి వైపు గట్టు జరిపి తనకు చెందిన 1.74 సెంట్లలోకి ప్రవేశించాడని మాచర్ల మండలం పశువేముల శివారు ఏకునామంపేట గ్రామానికి చెందిన షేక్.షబ్బీర్ ఫిర్యాదు చేశారు. అన్యాయంపై ప్రశ్నిస్తుంటే నీ భూమి అటువైపు ఉంటుంది.. కలుపుకో అంటున్నారని, అతను చెప్పిన వైపు పొలాలలకు వెళ్లే డొంక రోడ్డు ఉందని, తమకు న్యాయం చేయాలని కోరారు.

దుకాణం స్థలం కోసం ఆత్మహత్యాయత్నం

ఇటీవల వినుకొండ రోడ్డులో బస్టాండ్‌కు సమీపంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారిని మున్సిపల్ అధికారులు ఖాళీ చేయించారు. అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ అలీ ఖాళీ చేసిన ప్రాంతంలో తనకు బండి పెట్టుకొనే అవకాశం ఇవ్వాలని పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించారు. పరిష్కారం కాకపోవడంతో మనస్థాపానికి గురై గతంలో ఎలుకల మందు తాగాడు. తాజాగా కలెక్టరేట్‌లో స్పందన హాలు ఎదుట పెట్రోల్ పోసుకున్నాడు. గమనించిన పోలీసులు నిలువరించారు.

పాఠశాల స్థల ఆక్రమణపై ఫిర్యాదు

గ్రామంలో ఉన్న మండల పరిషత్ పాఠశాల స్థలాన్ని కొందరు ఆక్రమించారని నాదెండ్ల మండలం గణపవరానికి చెందిన ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. 120 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఆటస్థలం, వంట గది లేవని స్థలాన్ని ఆక్రమణ దారుల నుండి విడిపించి పాఠశాలకు అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామ విద్యార్థులకు మెరుగైన వైద్య అందించాలని కోరారు. దీనిపై గతంలోనూ ఫిర్యాదు చేశానని, స్పందన లేకపోవడంతో మళ్లీ వచ్చానని చెప్పారు.

ప్రతి ఇంటికీ మీతోపాటు నేనూవస్తా

- టిడిపి శ్రేణులకు మాజీ మంత్రి పుల్లారావు పిలుపు
- కార్యకర్తలు, నాయకుల సమక్షంగా ఘనంగా పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు పుట్టినరోజు సందర్భంగా టిడిపి శ్రేణులు పట్టణంలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పండరీపురంలోని పుల్లారావు నివాసం వద్ద నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలపడంతోపాటు సర్వమత పార్థనలు చేయించారు. టిఎన్‌టియుసి నాయకులు కంచర్ల శ్రీనివాసరావు 64 కిలోల భారీ కేకును కట్ చేయించారు. తెలుగు యువత, మహిళ విభాగాలు, 17వ వార్డు టిడిపి కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేకును పుల్లారావు కట్ చేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎస్.ఎస్ సుభాని ఆధ్వర్యంలో 2 వేల మందికి స్వీట్లు పంచారు. అనంతరం సీనియర్ నాయకులు సలిసం శ్రీనివాసరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 8 వేల మందికి భోజనం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు. అనంతరం రాజకీయాలపై మాట్లాడుతూ మహానాడులో విడుదల చేసిన పాక్షిక మేనిఫెస్టోను చూసి వైసిపి నేతలకు నిద్ర పట్టడం లేదని, యువత, మహిళ, రైతుల అభ్యున్నతే ప్రధాన ఎజెండాగా పథకాలను చంద్రబాబు ప్రకటించారని చెప్పారు. 18-59 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500, తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ.15 వేలు, నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3 వేలు, రైతులకు ఏడాదికి రూ.20 వేలు, ఆర్టీసీ బస్సుల్లో బహిళలకు జిల్లా పరిధిలో ఉచిత ప్రయాణ సదుపాయం, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను చంద్రబాబు ప్రకటించారని తెలిపారు. పార్టీ మేనిఫెస్టోను రానున్న ఐదు నెలల్లో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. శ్రేణులతోపాటు తానూ ఇంటింటికీ వస్తానని, అందరం కలిసి పని చేద్దామని అన్నారు.

మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేయాలి

ఎపి రైతు సంఘం డిమాండ్ - చిర్రావూరు కొనుగోలు కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. సోమవారం ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం నాయకులు డి వెంకటరెడ్డి, మేడూరు పాములు, మేకల నాగయ్యలతో కలిసి ఆయన పరిశీలించారు. మొక్కజొన్న రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా మొక్కజొన్న కల్లాలలో తడిచి, రంగు మారిన కారణంగా మొక్కజొన్న వేసిన రైతులు ఆందోళనలో ఉన్నారని అన్నారు. మొక్కజొన్న రైతులను ఆదుకునేందుకు, తక్షణమే మామూలు మొక్కజొన్నతో పాటు, రంగు మారిన మొక్కజొన్నను కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

చిర్రావూరులో కొనుగోలు కేంద్రం పరిశీలించిన రైతు సంఘం నాయకులు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి తమ సమస్యల పరిష్కారానికి వచ్చి, స్పందన అందించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత, జిల్లాలో వివిధ ప్రాంతాల వచ్చిన ప్రజల నుండి 145 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా నాణ్యతగా, గుణాత్మకంగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించే ఫిర్యాదులు హేతుబద్ధంగా వుండి, తిరిగి రీ ఓపెన్ కాకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోను బియాండ్ ఎస్.ఎల్.ఏ లోకి వెళ్లకుండా ఎప్పటికప్పుడు ఫిర్యాదులు పరిష్కరించాలన్నారు.పరిష్కరించిన ఫిర్యాదులు ప్రజల సంతప్తి స్థాయి ఉండే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ జి. రాజ కుమారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమీక్షించి, తగు సూచనలు చేశారు. పరిష్కరించిన ఫిర్యాదులకు సంబంధించి ర్యాండమ్‌గా కొంత మంది ఫిర్యాదుదారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సంతప్తిపై ఆరా తీశారు. ఫిర్యాదుదారు సంతప్తి చెందే విధంగా వారి విన్నపాలను పరిష్కరించాల్సి ఉందన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ మోహన్ రావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్ బాబు, డిఈఓ శైలజ, పంచాయతీ రాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య, హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, డీటీసీ కరీం, ఆర్ అండ్ బి ఎస్.ఇ నిర్మల తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేయాలనే నోటీసులను ఉపసంహరించుకోవాలి

పెదకాకాని గ్రామం, ఎన్‌టిఆర్ కాలనీలో నివశిస్తున్న ప్రజలను ఖాళీ చేయాలని ఎండోమెంట్ వారు నోటీసులు ఇవ్వటంపై కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌కు చేరుకొని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత 25 సంవత్సరాలుగా 450 కుటుంబాలు ఇక్కడే నివశిస్తున్నామని, తమకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించుకొని, ఇళ్ళను అక్కడే ఉండేలా చూడాలని కోరారు. మీ నివాసాలకు ఎలాంటి ఇబ్బంది లేదని నాయకులు గతంలో ఇచ్చిన భరోసాతో పక్కా గృహాలు నిర్మించుకున్నామని, ప్రభుత్వ నిధులతో కరెంటు, సిసి రోడ్లు, మంచినీరు, స్కూల్స్ వంటి సౌకర్యాలు కూడా కల్పించిందన్నారు. ఇటీవల కొంతమంది ప్రభుత్వ స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, మీ ఆధార్ కార్డులు ఎన్‌టిఆర్ కాలనీలో ఉన్నాయని, మీకు ఇళ్లు ఉన్నాయని చెబుతూ కొత్త స్థలాలు మంజూరు చేయలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ హైకోర్టు ద్వారా నోటీసులు ఇచ్చిందన్నారు. కావున నోటీసులు ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని, తమ ఇళ్లు తమకు కొనసాగించి, పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

కలెక్టరేట్‌కు వచ్చిన ఎన్‌టిఆర్ కాలనీ వాసులు

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు నేడు ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకూ ఆర్టీసి డిపో మేనేజర్ కార్యాలయంలో డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వహిస్తున్నట్లు గుంటూరు 2 డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున గుంటూరు-హైదరాబాద్, గుంటూరు- తెనాలి, గుంటూరు- విజయవాడ, గుంటూరు-విశాఖపట్నం రూట్‌లలో తిరుగుచున్న బస్‌ల గురించి, సిబ్బంది పనితీరు గురించి ప్రయాణీకులు 9959225421 నంబర్‌కు ఫోన్ చేసి తమ సూచనలు, సలహాలు ఇవ్వవలసిందిగా కోరారు.

పని చేయని సర్వర్లతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-పెదనందిపాడు

మండలంలో పిఎం కిసాన్‌కు సంబంధించి కొత్తగా నమోదు చేయించుకోవాల్సిన రైతులు మీసేవ కేంద్రాలలో సర్వర్లు పని చేయకపోవడం వల్ల, రోజూ పనులు మానుకొని వాటి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2023లో కొత్తగా నమోదు చేయించు కోవాల్సిన రైతులలో 30 శాతం మంది అప్లికేషన్లు సర్వర్ల సమస్య తో మిగిలిఉన్నాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం ఈనెల 30న పీఎం కిసాన్, రైతు భరోసా డబ్బులు వేస్తామని ప్రకటించగా, పీఎం కిసాన్ నమోదు కాని రైతులలో ఆందోళన నెలకొందన్నారు. గ్రామ సచివాలయాల దగ్గర, రైతు భరోసా కేంద్రాలలో ఈ వివరాల నమోదుకు అవకాశం కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలోకి మాత్రం తీసుకు రాలేదన్నారు. మీ సేవ కేంద్రాలలో గత నెల రోజుల నుంచి సర్వర్లు ఓపెన్ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సర్వర్ సమస్య పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పీఎం కిసాన్ లో నమోదు కాని రైతులకు, రాష్ట్ర ప్రభుత్వమే రైతు భరోసా ద్వారా రూ.13,500 జమ చేయాలని కోరుతున్నారు. అలాగే గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెల్లో కూడా వివరాల నమోదుకు అవకాశం కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇస్త్రీ బండి అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని ముగ్గురోడ్డుకు చెందిన వడగాని సుబ్బులు, సిహెచ్.జ్యోతి అదె దబండ్లపై ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పనులు లేక అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డికి తెలిపారు. విషయం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి తెలపగా ఇద్దరికి టిడిపి బండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం. వెంకటేశ్వరరావు, దుర్గారావు, ఎం.ప్రకాష్, బి.దాసు, సిహెచ్.శ్రీనివాస మధు, మాజీ కౌన్సిల్ లక్ష్మీరోజా, సిహెచ్.గోపి, టి.వికాస్ తదితరులు పాల్గొన్నారు.

'వికలాంగుల అభ్యున్నతికి జగన్ కృషి'

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్రంలో దివ్యాంగులు అభివృద్ధికి జగన్ కృషి చేశారని గుంటూరు జిల్లా అధ్యక్షులు, బాపట్ల జిల్లా అధ్యక్షులు నూర్‌బాషా అల్లాభక్షు, చల్లా రామయ్య అన్నారు. దివ్యాంగుల కోసం మందా కృష్ణమాదిగ టిడిపికి వంత పాడుతూ అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ప్యాకేజీ కోసమే ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారన్నారు. మందా కృష్ణమాదిగ తన ప్రకటనలు మానుకోకపోతే ప్రజాక్షేత్రంలో తిప్పికొడతామని హెచ్చరించారు. సోమవారం తాడేపల్లిలో జరిగిన వితేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో బండారు దుర్గారావు, బొక్కా అగస్టీన్ పాల్గొన్నారు.

తెలుగు మహిళల ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి : చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోకు మద్దతుగా తెలుగు మహిళలు సోమవారం లాలాపేట కన్యకాపరమేశ్వరి గుడి వద్ద నుంచి స్థానిక హిమని సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. టిడిపి జాతీయ అధికార ప్రతినిధి నశీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. మహిళలకు, యువతకు మేనిఫెస్టోలో అధిక ప్రాధాన్యత ఇచ్చారని నశీర్ అహ్మద్ తెలిపారు. ఈర్యాలీలో కార్పొరేటర్లు ముప్పావరపు భారతి, పోతురాజు సమత,రాష్ట్ర తెలుగు మహిళ నాయకులు గుడిపల్లి వాణి,అంగన్వాడీ అధ్యక్షురాలు చిదర్ల మల్లికా, పద్మావతి, లోకేశ్వరి, రహమత్, రమాదేవి తదితరులుపాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బైరగాని శ్రీనివాసరావు

భూ యజమాని ప్రమేయం లేకుండా

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

కౌలు గుర్తింపు కార్డు మంజూరులో భూ యజమాని సంతకంతో పని లేకుండా, కౌలు సాగుదారులను ప్రభుత్వమే గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, నాయకులు బోట్ల రామకృష్ణ అన్నారు. కౌలు రైతుల సమావేశం సోమవారం మేడికొండూరులో జరిగింది. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. జూన్ 5నుండి రాష్ట్రంలో కౌలు సమస్యలు పరిష్కారం కోరుతూ జీపు జాతా ప్రారంభం అవుతుందని, గుంటూరు జిల్లా జాతా వచ్చినపుడు కౌలు రైతులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలోమేడికొండూరు మండల సిఐటియు నాయకులు ఎస్ఎం భాష పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌ఆర్‌కు నూతన పైప్‌లైన్

పనులకు నగర మేయర్ శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

తాగునీటి సరఫరా పనులపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందని, ఏళ్ల తరబడి తాగునీరు సరఫరా చేసిన పాత పైప్ లైన్ల స్థానంలో ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. గుంటూరు నగరంలో నెహ్రునగర్ రిజర్వాయర్ నుండి లక్ష్మీపురం హెచ్.యల్.ఆర్ రిజర్వాయర్‌కు తాగు నీరు సరఫరా చేసే 800 యం.యం డయా పైప్ లైన్‌కు సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద తరచుగా లీకులు ఏర్పడి తాగు నీటి సరఫరాలో సమస్యలు ఏర్పడుతున్న నేపథ్యంలో సదరు ప్రాంతంలో నూతనంగా 900 యం.యం డయా పైప్ లైన్ రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నెహ్రు నగర్ రిజర్వాయర్ నుండి హెచ్.యల్.ఆర్ రిజర్వాయర్ వరకు ఉన్న ప్రస్తుత పైప్‌లైన్ ఏర్పాటు చేసి, సుమారు 60 ఏళ్లు అవుతుందన్నారు. ప్రస్తుతం సదరు పైప్‌లైన్‌కు లీకులు ఏర్పడటం, లీకుల మరమ్మతులు అధిక మొత్తంలో ఖర్చు అవటం, మరమ్మతుల సమయంలో ప్రజలకు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో నూతన పైప్‌లైన్ నిర్మాణానికి జిఎంసి ఆమోదం తెలిపిందన్నారు. నూతన పైప్‌లైన్ వేసే సమయంలో శివారు ప్రాంతాలకు తాగు నీటి సరఫరాలో కొంతమేర అంతరాయం కలిగే అవకాశం ఉన్నదని, కావున సదరు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేయటానికి చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగితే ప్రజలు ఇబ్బంది పడతారని, కావున సదరు పైప్‌లైన్ రీప్లేస్‌మెంట్ పనులు యుద్ధప్రాతిపదికన చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్.సజిలా, వైఎస్సార్సీపి గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్లు అయిశెట్టి కనకదుర్గ శ్రీనివాసరావు, నిమ్మల వెంకట రమణ, ధూపాటి వంశీ, పాపతోటి అంబేద్కర్, అగ్గిపెట్టి రాజు పాల్గొన్నారు.

కాపు చూసి.. కౌలు పెంచి..

- కౌలును రెట్టింపు చేసిన భూ యజమానులు
- మిర్చిలో దిగుబడులు బాగొచ్చాయని పెంపు

ప్రజాశక్తి - పెదకూరపాడు

కుడుమిస్తే పండుగలాగా గతేడాది మిర్చి దిగుబడి బాగా వచ్చిందని ఈ ఏడాది భూ యజమానులు కౌలుధరలు అమాంతంగా పెంచారు. గత సీజన్‌లో ఎకరా కౌలు రూ.5-12 వేలు మాత్రమే ఉండగా ఇప్పుడది రూ.15-30 వేలకు పెంచారు. అధిక దిగుబడితోపాటు ధరలూ కాస్తంత స్థిరంగా ఉండడం, ఈ ఏడాది కూడా మంచి దిగుబడి వస్తుందనే అంచనాలు ఉండడం ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.

మిర్చి సాగులో గత నాలుగేళ్ల అనుభవాలను పరిశీలిస్తే.. రెండేళ్లు తీవ్రంగా నష్టం వచ్చింది. ఒకేడాది నష్టాలే అయినా పెట్టుబడి వరకు కాస్త అటు ఇటుగా చేతికి వచ్చింది. దీంతో గతేడాది మిర్చి సాగును రైతులు భారీగా తగ్గించి ప్రత్తి, సోయా చిక్కుడు, అపరాల పంటల వైపు మళ్లారు. వాటి దిగుబడులూ అంతంత మాత్రంగానే ఉన్నా మిర్చి దిగుబడులు మాత్రం ఆశాజనకంగా అనిపించాయి. అయితే ఇందుకు రైతులు విపరీతంగా మందులు పిచికారీ చేయల్సి వచ్చింది.

సాధారణంగా సీజన్‌కు మిర్చి పైరులో 25 సార్లు మందులు పిచికారీ చేస్తుంటారు. అయితే గతేడాది మాత్రం ఇది 50కు పెరిగింది. దీంతో పెట్టుబడి కూడా రెట్టింపయ్యింది. మందుల వేయడానికి తడవకు మందు కొనుగోలే రూ.2 వేలు కాగా దాన్ని పిచికారీ చేయించడానికి కూలి ఖర్చు రూ.500 వరకూ అయ్యింది. ఈ లెక్కన రూ.1.25 లక్షలు మందులకే అయ్యాయి. దీంతో నల్లి, తామర పురుగు తెగుళ్లను అధిగమించి దిగుబడులు సాధించారు. మొత్తంగా ఎకరాకు రూ.2.5 లక్షల వరకూ పెట్టుబడి కాగా దిగుబడి కొన్నిచోట్ల 20 క్వింటాళ్లు, మరికొన్ని చోట్ల 30 క్వింటాళ్ల వరకూ రాగా సగటున 22 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చింది. ధర కూడా క్వింటాళ్‌కు సగటున రూ.18-19 వేల వరకూ దక్కింది. చివరిలో వర్షాలు వచ్చి ధరకు కొంత కోత పెట్టింది. అదే లేకపోతే రైతులకు మరింత మెరుగ్గా ఆదాయాలుండేవి.

ఇదంతా చూసిన రైతులు, కౌలు రైతులు ఈ ఏడాది కూడా పంట బాగా పండుతుందని, తమ అప్పులు తీర్చుకోవడానికి ఇదే సరైన అదునని మిర్చి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీన్ని అవకాశంగా చేసుకుంటున్న భూ యజమానులు కౌలు ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. ఇప్పటికే కౌలుకు సాగు చేస్తున్న వారు కూడా పెంచిన ధర ప్రకారం కౌలు ఇవ్వాలని, లేకుంటే పొలాన్ని ఇతరులకు కౌలుకిస్తామని తెగేసి చెబుతున్నారు. దీంతో చేసేది లేక వారు కూడా అధికమొత్తంలో కౌలు చెల్లించుకోవాల్సి వస్తోంది.

మండలంలో సాగుభూమి 29,033 ఎక రాల ఉండగా గతేడాది పత్తి 17 వేల ఎకరాలు, మిర్చి 5025 ఎకరాలు, సోయాబీన్ 3 వేల ఎకరాలు, వరి 500, ఎకరాలు, పసుపు 300 ఎకరాలు, సుబాబుల్ వెయ్యి ఎకరాలు, పండ్ల తోటలు 150 ఎకరాల్లో సాగయ్యాయి. వాస్తవానికి మండలంలో మిర్చి సాగు సాధారణ విస్తీర్ణం 10 వేల ఎకరాలు. మిర్చిలో ఏ కొత్త రకం విత్తనం వచ్చినా దాన్ని పెదకూరపాడు ప్రాంతంలో సాగు చేసి ఫలితాలు బాగుంటే ఇతర ప్రాంతాల్లోనూ సాగుచేసే సంప్రదాయం ఉంది. అయినా కొన్నేళ్లుగా వరుస నష్టాల వల్ల సాగును బాగా తగ్గించారు. అయితే ప్రస్తుతం గతేడాది పత్తి సాగు చేసిన పొలాల్లోనూ మిర్చి సాగుచేస్తే తెగుళ్లు పెద్దగా ఆశించవని, పంట బాగా పండుతుందని రైతులు భావిస్తున్నారు.

కౌలు రెట్టింపయ్యింది

దాసరి శ్రీనివాసరావు, కౌలు రైతు, పెదకూరపాడు

నేను గతేడాది ఎకరం రూ.16 వేలు చొప్పున మూడెకరాలు కౌలుకు వేశాను. ఇప్పుడు అదే పొలం కౌలు రూ.27 వేలకు పెంచారు. మేము కాకుంటే వేరేవాళ్లకు పొలం ఇస్తామంటున్నారు. మరొకరిదగ్గర కౌలుకు తీసుకుందామన్నా అక్కడ ఇంతకు తక్కువేమీ కౌలు ఉండడం లేదు. అందుకని అధిక కౌలు చెల్లించక తప్పడం లేదు.

మిర్చిసాగు విస్తీర్ణం పెరిగే అవకాశం

నిత్యశ్రీ
ఉద్యాన శాఖాధికారి

మిర్చి సాగు గతం కంటే దాదాపు సగానికి తగ్గింది. అయితే దిగుబడులు అశా జనకంగా ఉండడం, ధరల స్థిరత్వం కారణంగా మిర్చి సాగుకు రైతులు ఉత్సా హంగా ఉన్నారు. సాగు విస్తీర్ణం గతేడాదికంటే ఈ ఏడాది పెరిగే అవకాశం ఉంది. అయితే పొలం మొత్తం మిర్చి మాత్రమే వేయకుండా కొన్ని రకాల ఉద్యాన పంటలు వేసుకుంటే మంచిది.

మాట్లాడుతున్న ఎంపిపి ఈదర రాధిక

ప్రజాశక్తి-ఈపూరు

ప్రజా ప్రతినిధులు అధికారులను సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని అనేకమార్లు చెప్పినప్పటికీ ఎందుకు ఏర్పాటు చేయటంలేదని జడ్పిటిసి చౌడయ్య విద్యుత్ శాఖ ఏఈ షేక్ రఫిని అడగగా పంచాయతి వారు కరెంటు స్తంభాలకు నగదు చెల్లించాలన్నారు. అలాగే,ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని ఆస్పత్రి మందులు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయని, వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎంఈఓ కె.బాబురెడ్డి పాఠశాలలో ఉపాధ్యాయుల విధులు,పనితీరుపై మాట్లాడుతుండగా కొచ్చర్ల గ్రామ సర్పంచ్, వైసీపీ మండల కన్వీనర్ కోపెల దేవరాజ్ కలగజేసుకొని పదో తరగతి ఫలితాలు ఆశాజనకంగా లేవని ఉపాధ్యాయుల విద్యా బోధన నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు ఫెయిల్ అయ్యారన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరు వెంకటేశ్వర్లు మాట్లాడారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణంలో వివిధ ప్రాంతాలలో మంగళవారం మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె షమ్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కాకతీయ కళ్యాణమండపం రోడ్డులో పైపులైను పై ఏర్పడిన లీకులు అరికట్టు పనులు చేపట్టడం జరిగింది. మే 30 న మంగళవారం పట్టణంలోని 10వ వార్డు నుండి 31వ వార్డు వరకు అనగా నాగార్జున నగర్, క్రిస్టియన్ పేట, స్టేషన్ రోడ్డు, ముస్లిం ఏరియా, రంగా కాలనీ, అంబేద్కర్ నగర్, నిర్మలా నగర్ 10,9,8,7,6,5,4,3, 2,1, 25,26,27,28,29,30 మరియు 31 వార్డుల ప్రాంతాలలో రక్షిత మంచినీరు సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ ప్రజలందరూ గమనించి పురపాలక సంఘానికి సహకరించాల్సిందిగా ప్రకటనలో కోరారు.

పిడుగురాళ్లలో ఫ్లెక్సీ వార్

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

వైసిపి ప్రభుత్వం పిడుగురాళ్ళ పట్టణ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధం అనే ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని జనసేన ఆధ్వర్యంలో పిడుగురాళ్ళ మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం పట్టణంలోని ఐలాండ్ సెంటర్ నందు ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. వెంటనే పోలీసలు నిరసన ఆపాలని తెలిపారు. దీంతో జనసేన నాయకులకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

ప్రజాశక్తి-తాడేపల్లి:

తాడేపల్లిలో ఎప్పుడు లేని విధంగా ఫ్లెక్సీల రగడ మొదలైంది. జనసేనను టార్గెట్ చేస్తూ ఇటీవల మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన వేమారెడ్డి వర్గీయులు సిఎం క్యాంపు కార్యాలయం సమీపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చంద్రబాబు, లోకేష్‌లను పవన్‌కల్యాణ్, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, ఈనాడు రామోజీరావు పల్లకి మోస్తున్నట్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కలకలం రేపుతోంది. పేదలకు, పెత్తందారులకు జరుగుతున్న యుద్ధం అనే వ్యాఖ్యలతో ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

మోడల్ పరీక్షల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక శాఖ గ్రంథాలయంలో శ్రీనాథ సాహితీ పరిషత్తు సహకారంతో గత నెల రోజుల నుంచి వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా జూన్ 4 న స్థానిక శాఖ గ్రంథాలయంలో 3-మోడల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి స్వర్ణ చిన రామిరెడ్డి తెలిపారు .అందుకు సం బంధించిన వివరాలతో కూడిన వాల్‌పోస్టర్‌ను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ కలెక్టర్ కార్యాలయం లో సోమవారం ఆవిష్కరించారు. ఈ మోడల్ పరీక్షలు.. పరీక్ష 1. ఏడుగురు మహనీయులు యొక్క జీవిత చరిత్రల మీద- గౌతమ బుద్ధుడు, మహాత్మా గాంధీ, స్వామి వివేకానంద, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ,జవహర్లాల్ నెహ్రూ, మదర్ థెరిసా,అబ్దుల్ కలాంల పై ఉంటుందని అన్నారు. పరీక్ష 2. జనరల్ మ్యాథమెటిక్స్, పరీక్ష 3-జనరల్ నాలెడ్జ్ మీద ప్రశ్నలు తెలుగు మీడియంలో 50 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయని ఏడు నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు కామన్ గా పేపర్ ఉంటుందని వివరించారు. పరీక్షా వేదిక శాఖా గ్రంథాలయం పల్నాడు బస్టాండు నరసరావుపేట ఆదివారం ఉదయం 8.15 నుండి 12.00 గంటల వరకు జరుగుతాయని వివరించారు. పరీక్షకు హాజరు కావలసినవారు తప్పనిసరిగా వారి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8106276869, 9989707279 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నవ్య శ్రీ డి.ఆర్.ఓ కె.వినాయకం, నరసరావుపేట లైబ్రేరియన్ వై. రాధ, జిల్లా సెక్రటరీ ఝాన్సీ, గద్య పద్య కవి చక్రవర్తి, ఈవూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీనాథ సాహితీ పరిషత్తు కార్యదర్శి స్వర్ణ చిన రామిరెడ్డి జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తదితరులు

మొబైల్ అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించిన ప్రత్తిపాటి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలో నిరుపేదల కడుపు నింపే ఉద్దేశంతో ప్రత్తిపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొబైల్ అన్నా క్యాంటీన్ ను సోమ వారం నాడు ఏర్పాటు చేశారు. పుల్లారావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మొబైల్ అన్నా క్యాంటీన్ ను మాజీ మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ, రోజుకు 300 మంది మందికి ఈ మొబైల్ క్యాంటీన్ ద్వారా భోజన వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు. గతంలో పట్టణంలో 3 ప్రాంతాలలో అన్నా క్యాంటీన్లను ప్రారంభించి పేదలకు రూ.5కే భోజనాన్ని అందించామన్నారు. టిడిపి మళ్లీ అధికారంలోకి వచ్చేవరకు ఈ మొబైల్ క్యాంటీన్ ద్వారా ప్రజలకు రూ.2కే భోజనం అందిస్తామని చెప్పారు.ఈ సేవా కార్యక్రమంలో ఎవరైనా పాల్గొనదలుచుకుంటే ప్రత్తిపాటి చారిటబుల్ ట్రస్ట్ వారికి ఒకరోజు భోజనానికి అయ్యే ఖర్చును విరాళం గా ఇస్తే, విరాళం ఇచ్చిన వారి పేరుతో ఒక్కరోజు భోజన సదుపాయం పేద లకు కల్పిస్తామని అన్నారు.

చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడుకి పేదలంటే కోపమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. పేదలకు పంపిణీ చేసే ఇళ్ల స్థలాలను చంద్రబాబు నాయుడు సమాధులతో పోల్చడాన్ని నిరసిస్తూ సోమవారం నాడు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. నరసరావుపేట సెంటర్ నుంచి అడ్డరోడ్డు, కళామందిర్ సెంటర్ మీదుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలంతా జగనన్న వెన్నంటే ఉన్నారని చంద్రబాబు రగిలిపోతున్నారని తెలిపారు. పేదలకు జగనన్న ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని, అలాంటి ఇళ్ల స్థలాలను చంద్రబాబునాయుడు సమాధులతో పోల్చడం అత్యంత దారుణమైన విషయమన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
మంగళవారం 30 మే 2023

నూతన మంచినీటి పైపులైను ప్రారంభం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పైపులైన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రావ్య

గుంటూరు జిల్లా పొన్నూరు మండలం దోప్పలపూడి గ్రామం లోని ఎస్టీ కాలనీలో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావ్య నూతన మంచినీటి పైపులైనును ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం కింద గ్రామంలోని ఎస్టీ కాలనీకి మూడు లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు తెలిపారు. నిధుల ద్వారా కాలనీలోని గహాలకు మంచినీటి పైపుల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. దీంతో ఎస్టి కాలనీవాసులకు మంచినీటి కష్టాలు తీరినట్లేనని అన్నారు.

వాలంటీర్లకు పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి-దుగ్గిరాల

ఎటువంటి వివక్ష లేకుండా పక్షపాత రహి తంగా ప్రజలకు సేవలు అందిస్తున్నం దుకు వాలంటీర్ల సేవ లు గుర్తిం చి ప్రభుత్వం పుర స్కారాలు ప్రక టించినదని ఎంపీపీ దానబోయిన సంతోష రూప వాణి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వాలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. సేవారత్న పురస్కారం అందుకున్న వారికి 30 వేలు సేవా రత్నకు 20000 సేవా మిత్ర కు పదివేల రూపాయలు నగదు వారి ఖాతాలో జమ చేస్తారు. అనంతరం జడ్పిటిసి మేకతోటి అరు,ఎంపీడీవో కుసుమ శ్రీదేవి మాట్లాడారు. ముగ్గరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవ రత్న, 300 మందికి సేవ మిత్ర పురస్కారాలు వచ్చినట్లు ఎంపీడీవో చెప్పారు. వాలంటీర్లు అందరినీ ఘనంగా సత్కరించారు.

'చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు'

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

చంద్రబాబు నాయుడు మహానాడుసభలో నిన్న ప్రకటించిన మేనిఫెస్టో పార్ట్1 ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వైఎస్ఆర్సిపి మాజీమున్సిపల్ ఫ్లోర్ లీడర్ షేక్ సుఫియా సుల్తానా దుయ్యబట్టారు. ఆమె కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన మేనిఫెస్టోలో అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కారని ప్రస్తుతం దానికి మించిన అమలు కాని హామీలను ప్రస్తుత మేనిఫెస్టోలో పొందుపరిచారని ఆమె విమర్శించారు.

ఏపీఎస్పీ డిఐజిని కలిసిన ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-మంగళగిరి

ఏపీఎస్పీ డిఐజిగా బి.నాగరాజు కుమారి సోమవారం ఏపీఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు డి ఐ జి ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఏ గణపతి అసోసియేషన్ సభ్యులు సిహెచ్ వి శేఖర్, ఎస్.కె మౌలాలి, నారాయణ, బసవలింగం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-మంగళగిరి

మహానాడులో చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించిన మహిళా వరాలను హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం మంగళగిరి నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. టిడిపి బీసీ మహిళ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ భూలక్ష్మి, టి జానకి దేవి, ఎం వైష్ణవి, వి ఆశా బాల, కె అనిత, యు దుర్గా మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నవులూరులో ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరిరూరల్

లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

నవులూరు లేఔట్‌లో రెండో రోజు సోమవారం పట్టాల పంపిణీ కార్యక్రమం సాగింది. ఎమ్మెల్యే ఆర్కే అర్హులైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేశారు. నవులూరు లేఔట్ లో ఎర్రబాలెం 1, 2, 3 సచివాల యాల పరిధిలోని సుమారు 500 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేద ఒక్కరు కూడా ఉండకూడదని మహా సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. పేదవాడి సొంత ఇంటి కల నెరవేరబోతున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీలు అవరోధాలు సష్టిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని అవరోధాలు సష్టించిన రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పక్షాన నిలబడి ప్రతి పేదవాడి చిరకాల స్వప్నం సొంత ఇంటి కల నెరవేర్చి, వారికి అండగా నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రాంప్రసాద్, రెవెన్యూ అధికారులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లాకులు, కాలువల మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-తెనాలి

సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

కష్ణ పశ్చిమ డెల్టా పరిధిలో లాకులు, కాలువ గట్ల మరమ్మతులు చేపట్టాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం అధ్యక్షులు దరిశి శివ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివ కోటేశ్వరరావు మాట్లాడుతూ దుగ్గిరాల లాకుల నుంచి తూర్పు, పడమర, మధ్య కాలువలకు నీరు విడుదలవు తుందని, ఇది దిగువ ప్రాంతాల వారికి సాగు, తాగు నీటికి ఉపయోగపడుతుందన్నారు. ఈనెల 23న సం ఘం ఆధ్వర్యంలో దుగ్గిరాల వద్ద లాకులు, కాలువగట్ల పరిస్థితులను పరిశీలించమన్నారు. అయితే లాకుల గేట్లు తుప్పుపట్టి ఉన్నాయని, వాటికి చెక్కలు అడ్డుపెట్టి ఉన్నాయన్నారు. అలాగే కాలువ గట్లు కూడా బలహీనంగా ఉన్నాయన్నారు. ఈ పరిస్థితి చాలా ప్రమాదకరమని భవిష్యత్తులో పంటలు మునిగిపోయే ప్రమాదం ఉంటుందని, తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కాలువ గట్లు మరమ్మతులు, లాకులు మరమ్మతులు చేపట్టాలని కోరారు ఆయన వెంట సంఘ కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, మాచిరాజు రామకష్ణమూర్తి, ఆర్ఎస్ శంకరరావు, సిహెచ్ మురళి జగన్మోహనరావు, ఎన్ కమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - పెదనందిపాడు

విద్యార్థులు ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని, గ్రంథాలయ పుస్తక పఠనం వలన మానసిక ఉల్లాసం, ప్రపంచ జ్ఞానం కలుగుతుందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు పేర్కొన్నారు. శాఖా గ్రంధాలయం, పెదనందిపాడులో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంధాలయ నిర్వహకురాలు పి సుభాషిని అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన సమావేశంలో మోహనరావు మాట్లాడుతూ కథలు, కథనాలు, సృజనాత్మక కత్యాలు నిర్వహించడం వలన విద్యార్థులలో నైతిక విలువలు పెరుగుతాయని, సజనాత్మకత పెరుగుతుందని తెలిపారు. గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిని మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పుస్తక పఠనం, నీతి కథలు చదవడం, చెప్పడం, అభినయ గేయాలు, చిత్రలేఖనం అంశాలపై తర్ఫీదు పొందారని తెలిపారు.

. ప్రజాశక్తి - పెదకాకాని

పెదకాకాని శాఖ గ్రంధాలయంలో సోమవారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురం ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ లైబ్రరీలు విజ్ఞాన భాండాగారం అని, ప్రతి ఒక్కరు చక్కగా చదువుకుని మంచి పౌరులుగా ఎదగాలని చెప్తూ రంగు కాగితాలతో రకరకాల పూలు దండలు, గ్రీటింగ్ కార్డులు,పాత వార్తాపత్రికలతో రకరకాల టోపీలు నేర్పించారు.

గాలిలో నుండి బంతులు తీయడం ఖాళీ సంచి నుంచి పెద్ద పెద్ద వస్తువులు సష్టించడం ఎర్రని జేబు రుమాలను చూస్తుండగానే బంతిగా మార్చడంచేశారు. బంతిని మింగి మళ్ళీ గాలిలో నుండి తెప్పించడం చేసి చూపిస్తూ వీటి వెనక ఎటువంటి మాయలు మంత్రాలు లేవని కేవలం ఉన్నదంతా సైన్సు అని చెప్తూ ప్రయత్నిస్తే ప్రతి ఒక్కరూ మ్యాజిక్ నేర్చుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా చిన్నచిన్న ట్రిక్కులు వారితో చేయించారు. లూథర్ గిరి కాలనీ లోని గ్రంధాలయ అధికారి వేముల విజయకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పెదకాకానిలో..

ప్రావిడెంట్ ఫండ్ సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఏంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్లో సోమవారం ఉదయం ప్రావిడెంట్ ఫండ్ సమస్యలపై అవగాహన కార్యక్రమం ఈపీఎఫ్ గుంటూరు వారి ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్ ప్రోగ్రాం జరిగింది. ప్రధానంగా ప్రావిడెంట్ ఫండ్ కు సంబంధించిన సమస్యల పై ఈ కార్యక్రమం నిర్వహించారు. అవగాహన, పరిష్కరణ, భవిష్య నిధి యజమానులు, ఉద్యోగులు,పెన్షన్‌దారుల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్మెంట్ ఆఫీసర్ పి మధుసూదన రావు, పి సుధాకర్, కే సుధాకర్ రావు, మూర్తి, అరవింద హై స్కూల్ సెక్రటరీ సిహెచ్ సాయి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండలో వైసిపి ర్యాలీ

ప్రజాశక్తి - తాడికొండ

కులమత ప్రాంతాలకు అతీతంగా పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి చరిత్ర సష్టించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు రాజధాని ప్రాంతంలో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన సందర్భంగా తాడికొండ అడ్డరోడ్డు వద్ద నుండి తుళ్లూరు లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు ర్యాలీ సోమవారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడిగా పని చేస్తూ ఎవరు ఇవ్వలేని సంక్షేమాన్ని అందిస్తున్నారని తెలిపారు తండ్రికి తగ్గ తనయుడు అని ప్రజలు కొనియాడుతున్నారని అన్నారు. తాడికొండ అడ్డరోడ్డు నుండి ప్రారంభమైన భారీ ర్యాలీ వందలాది ద్విచక్ర వాహనాలు ముందు అనుసరిస్తుంచాయి. అదేవిధంగా చంద్రబాబు నాయుడుకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు

గుత్తేదారులకు ఆర్టీసీ ఆహ్వానం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి ఆర్టిసి బస్ డిపోలో ఖాళీ స్థలాలలు అద్దెకు టెండర్లు ఆహ్వానిస్తూ డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. డిపో పోర్టుకో ఎదురు స్థలాన్ని, కాలేజి రోడ్డు ముఖద్వారం ఎదురు స్థలాలను 15 సంవత్సరాలు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు బిడ్డర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మే 30న జరిగే గుత్తేదారుల సమావేశంలో వ్యాపారులు పాల్గొనాలని కోరారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - పెదకాకాని

శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం పెదకాకాని నందు జూన్ 1 నుండి 3వ తేదీ వరకు నిర్వహించు మహా కుంభాభిషేకం సందర్భంగా హైదరాబాద్,వాచ్ఎస్ఎన్ టెక్నా లజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన గోవాడ అనంతలక్ష్మి, కుమారుడు, కోడలు గోవాడ శ్రీనాథ్,సౌజన్య దంపతులు రూ. లక్ష రూపాయల విరాళం అందజేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ నిమిత్తం ఈ నిమిత్తం ఆదివారం సాయంత్రం దేవ స్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి యన్. శ్రీని వాస్ రెడ్డికి కార్యాలయంలో నగదు అందించారు. అన్నప్రసాద వితరణకు నగదును వినియోగిస్తామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు సోమవారం తెనాలిలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కనపర్తి రత్నాకర్ నాయకత్వంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ వాణికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి జర్నలిస్ట్ కు అక్రిడిటేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. తెనాలి ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ చొరవ తీసుకుని తెనాలి జర్నలిస్ట్ ల చిరకాల స్వప్నం స్వప్నం నెరవేర్చాలన్నారు. ఫెడరేషన్ తెనాలి డివిజన్ అధ్యక్షుడు మంచికలపూడి రవికుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు కార్మిక బీమా, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. మీడియా హై పవర్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అక్రిడిటేషన్ కమిటీలో ఫెడరేషన్‌కు స్థానం కల్పించాలన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు అంబటి శ్యామ్ సాగర్ మాట్లాడుతూ చిన్న పత్రికల జర్నలిస్టులకు అక్రెడిటేషన్ మంజూరు చేయాలన్నారు. విలేకరులపై దాడులకు పాల్పడుతున్న వారిపై

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫెడరేషన్ నాయకులు, జర్నలిస్టులు

చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి దొండపాటి కోటేశ్వరరావు, వేమూరు అధ్యక్షులు మేకల సుబ్బారావు, తెనాలి నియోజకవర్గ కార్యదర్శి పుట్ల పున్నయ్య, నాయకులు గురిందపల్లి ప్రభాకరరావు, ఎస్ ఎస్ జహీర్, జి. ప్రేమ్ కుమార్, అచ్యుత సాంబశివరావు, కరేటి సాంబశివరావు, మునిపల్లి శ్రీకాంత్, సభ్యులు దేవరపల్లి రవికిరన్, మల్లవరపు ప్రసాద్, వున్నం ధవన భూషణరావు, దాసరి వెంకటేశ్వరరావు, బొరిగొర్ల చంద్ర మోహన్, మారిశెట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా జగనన్నకు చెబుదాంలో 53 ఫిర్యాదులు

విచారణ చేసి అర్జీదారులకు సత్వర న్యాయం చేయాలని సిబ్బందికి ఎస్‌పి ఆదేశాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి సత్వర న్యాయం చేయాలని పోలీస్ సిబ్బందిని ఎస్పీ వై. రవి శంకర్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్ కె చంద్రశేఖర్, ఏఆర్ అదనపు ఎస్పి డి రామచంద్ర రాజు, డీఎస్పీలు కె.వి మహేష్, రవిచంద్ర, బి.ఆదినారాయణ, పల్లపు రాజు, ఏ ఆర్ డి ఎస్ పి చిన్ని కృష్ణ పాల్గొన్నారు.

ఎంత ఖర్చయినా ఇస్తానని ఇవ్వలేదు

సరుపుల రాధాకృష్ణ, రొంపిచర్ల మండలం, ఇంద్రగిరి గ్రామం

నరసరావుపేటకు చెందిన కుంచాల శ్రీనివాసరావు వినుకొండ రోడ్డులో వర్జిన్ ఆయిల్ మిల్ నడుపుతున్నారని యజమాని నివాసం ఉండే బహుళ గృహ సముదాయంలో 10 ఏళ్లకు పైగా కాపలాదారునిగా ఉంటున్న నన్ను కూలీల కొరత అంటూ ఆయిల్ మిల్లులో పనికి తీసుకువెళ్లాడు. పని చేయలేకపోతున్నానని మానివేస్తానని యజమానినికి చెప్పాను. గత నెలలో కొత్తగా పనికి వచ్చిన కూలీలకు పని నేర్పాలని చెప్పి మళ్ళీ పనిలోకి రావాలని ఒత్తిడి చేయడం ఆరోగ్యం బాగా లేదని నిరాకరించడంతో కాపలా ఉద్యోగం నుండి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడడంతో ఆయిల్ మిల్లులో పనికి వెళ్లాను. ఈ క్రమంలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కుడి చెయ్యి గానుగలో పడి 80 శాతం దెబ్బతిన్నది. ప్రథమ చికిత్స చేసిన నరసరావుపేట ప్రయివేటు హాస్పిటల్ వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరు వెళ్లాలని చెప్పారు. కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రయివేటు హాస్పిటల్ లో వైద్యం చేయించగా రూ.2 లక్షలకు పైగా ఖర్చయ్యాయి. ఎంత ఖర్చైన భరిస్తానని చెప్పిన యజమాని చికిత్స అయిపోయాక రూ.1 లక్ష ఇచ్చి చేతులు దులుపుకొన్నాడు. గతంలో మాదిరి తాను పని చేసే పరిస్థితి లేదని, ఉపాధి కోల్పోయిన తనకు జీవించేందుకు ఇబ్బందులు లేకుండా న్యాయం చేయాలని ఎస్పీని వేడుకున్నారు.

అర్జీదారులకు ఉచిత భోజనం

స్పందనలో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలకు నరసరావుపేట పట్టణానికి చెందిన బచ్చు సత్య కిషోర్- నాగ మల్లిక ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా, కమిటీ సభ్యులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు ఊరా భాస్కర్ రావు ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి ప్రారంభించి, అర్జీదారులకు భోజనాలు వడ్డిం చారు. భోజనాలు ఏర్పాటు చేసిన ఊరా భాస్కర్ రావును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అప్పుతీసుకున్న సొమ్ము ఇప్పించండి

వ్యాపార నిమిత్తం డబ్బులు అప్పుగా కావాలని ఒక మహిళ తన వద్ద రూ. 86 వేలు మరొక మహిళ వద్ద రూ .3.50 లక్షలు తీసుకుని తర్వాత మా డబ్బులు మాకు తిరిగి ఇవ్వమని కోరగా స్పందించడం లేదని పోలీసులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని డబ్బులు మాకు ఇప్పించాలని సత్తెనపల్లికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు.

పొలం కొంటామని సొమ్ము తీసుకున్నారు

7 ఏళ్ల క్రితం పాము కాటు వలన చనిపోగా అతని బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ .7.50 లక్షలు మరిది మరియు వరసకు బాబాయి అయ్యే వ్యక్తి తీసుకొని తన పేరు మీద స్థలం కొంటామని చెప్పి ఇంతవరకు ఏమీ కొనకుండా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని న్యాయం చేయాలని మాచవరం మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

కొడుకు, కోడలు ఇబ్బంది పెడుతున్నారు

కొడుకు, కోడలు, మనవడు ముగ్గురు కలిసి మనవడి చదువు కోసం అమెరికా పంపించాలని రూ .25 లక్షల ఇవ్వమని ఇబ్బంది పెడుతున్నారని గతంలో రూ. 15 లక్షలు ఇచ్చామని ఇప్పుడు అంత స్తోమత లేదని చెబుతున్నా వినకుండా బెదిరిస్తున్నారని వేధింపులు తాళలేక ఫిర్యాదు చేస్తున్నట్లు నరసరావుపేట మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

జిఎంసి స్పందనకు 32 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి సమస్యలపై అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన నిర్వహించిన కారక్రమంలో శ్రీనివాసరావు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం 10, ఇంజినీరింగ్ విభాగం 11 , ప్రజారోగ్య విభాగం 4, రెవెన్యూ విభాగం 2 , ఉపా సెల్ విభాగం కి సంబధించి 2, పరిపాలన విభాగానికి సంబందించి 3, మొత్తం 32 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకటకష్ణయ్య, ఎస్.ఈ. భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, సిఎంహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎం.హెచ్.ఓ. డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్, తదితరులు

1 నుండి బాల కార్మికుల నిర్మూలనపై ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు : బాల కార్మికుల నిర్మూలనపై జూన్ 1 నుండి 30వ తేదీ వరకూ జరుగుతున్న ప్రచార కార్యక్రమానికి మండల, గ్రామ స్థాయి అధికారులు టాస్క్‌ఫోర్స్ అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ప్రచార కార్యక్రమం విజయవంతంపై సోమవారం కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12న ప్రపంచ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులతో ర్యాలీ నిర్వహించాలన్నారు. రక్షించిన బాల కార్మికులకు పునరావాసం కల్పించాలని, చదువు మానేసిన బాలలను తిరిగి బడిలో చేర్పించాలని ఆదేశించారు. ప్రచార కార్యక్రమం నిర్వహణకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి మనోరంజనిని నోడల్ అధికారిగా నియమించారు.

వివాద రహిత గ్రామంలో కేసు నమోదు

లింగాపురంలో రెండు సామాజిక తరగతుల మధ్య ఘర్షణ - పలువురికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు జిల్లా, మాచర్ల మండలంలోని లింగాపురం గ్రామం 2013లో వివాద రహిత గ్రామంగా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో ఆవార్డు అందుకుంది. సదరు గ్రామంలో స్వల్ప వివాదాలు తలెత్తిన పెద్దల సమక్షంలో పరిష్కరించుకోని కేసులు నమోదు అయ్యే వరకు రాకుండా చూసుకుంటారు. అటువంటి గ్రామంలో గత రెండు రోజులుగా జరిగిన ఘర్షణలలో పలువురికి గాయాలు అయినాయి. సదరు గ్రామంలో మెజారిటీ సామాజిక వర్గం బిసి కులానికి చెందిన ఒకే సామాజిక వర్గం. దళితులవి షుమారు 10ఇళ్ళు మాత్రమే ఉంటాయి. గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య తలెత్తిన స్వల్ప వివాదం చిలికిచిలికి పెద్దదవ్వడంతో రెండు వర్గాలు రాళ్ళతో ఎదురు దాడులు చేసుకోనే వరకు వచ్చింది. శనివారం ఒక పర్యాయం ఘర్షణ జరగగా వారు పోలీసు స్టేషన్ వరకు రావటం పెద్దల సమక్షంలో చర్చలు జరగటం జరిగింది. ఆయినప్పటికి ఆదివారం రాత్రి ఇరు వర్గాలు తిరిగి రాళ్ళ దాడులు చేసుకోవటంతో పలువురికి గాయాలు అయినాయి. ఇరు వర్గాలకు చెందిన నాగభూషణం, నరసింహరావుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్.ఐ రాజశేఖర్ 12 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఒకరు చెన్నుబోయన క్రిష్ణ తలకు బలమైన గాయం తగలటంతో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో ప్రధమ చికిత్స అనంతరం గుంటూరుకు తరలించారు.

లింగాపురానికి ఘనమైన చరిత్ర

స్వాతంత్రం వచ్చిన తరువాత ఎటువంటి వివాదలు నమోదు కాని గ్రామాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 7 గ్రామాలను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని లీగల్ సర్వీసెస్ ఆధార టీ ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేసింది. అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పినాకి చంద్రఘోష్ లింగాపురం గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులను అభినందించి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ప్రకటించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు కూడ సదరు గ్రామంలో ఎటువంటి కేసు నమోదు కాలేదు. మాచర్ల నియోజకవర్గం ఫ్యాక్షన్ గ్రామలకు పెట్టింది పేరు. అధిపత్య పోరాటాలు, ఫ్యాక్షన్ హత్యలు, గొడవలకు నియోజకవర్గానికి పెద్ద రికార్డు ఉన్నది. అటువంటి నియోజకవర్గంలో లింగాపురం గ్రామం ఆదర్శ గ్రామంగా ఎంపిక కావటం పట్ల నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపుగా చెప్పుకునేందుకు నిలిచింది. అటువంటి గ్రామంలో తాజగా కేసు నమోదు కావటం పట్ల పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సకాలంలో సరైన చర్యలు తీసుకుని ఘర్షణ పెద్దది కాకుండా చూసి ఉంటే బాగుండేదని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తిరిగి సదరు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చేసేందుకు అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యక్రమానికి హాజరైన వైద్యులు, క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ వారు మణిపాల్ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక కమ్మ జన సేవా సమితిలో ఉచితంగా క్యాన్సర్ స్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. సుమారు 90 మందికిపైగా మహిళలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము కాన్సర్, పాప్ స్విమ్మర్, మయోగ్రమీ పరీక్షలు చేయించుకున్నట్లు రోటరీ క్లబ్ సెంటినియల్ ప్రెసిడెంట్ కందిమళ్ల స్వప్న తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రమేష్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హరిత, ఆయుష్మాన్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక హాజరై క్యాన్సర్ కారకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఏడుకొండలు, కోశాధికారి వీరయ్య, క్లబ్ సభ్యులు హాజరయ్యారు.

ఎంపిడిఒ ప్రమోషన్లపై హర్షం

బండి శ్రీనివాసలు

ప్రజాశక్తి-గుంటూరు : పంచాయితీరాజ్ శాఖలో పనిచేస్తున్న 112 మంది పరిపాలనాధికా రులకు, 93 మంది పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారులకు, మండల పరిషత్ అబివృద్ధి అధికారులుగా పదోన్నతి కల్పించటంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసలు సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. న్యాయపరమైన ఇబ్బందుల కారణంగా గత 6 నెలలుగా అపరిష్కృతంగా ఉన్న పదోన్నతుల సమస్యను పరిష్కరించి, పంచాయితీరాజ్ శాఖలో ఎంతోకాలంగా ఖాళీగా ఉన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయటం శుభపరిణామం అన్నారు. ఈ చర్య వల్ల పరిపాలనా పరమైన ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పోస్టులను క్రింది కేడర్ల నుండి ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయటం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా పంచాయితీరాజ్ శాఖలో పనిచేస్తున్న వేయి మందికిపైగా సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు, రికార్డు అసిస్టెంట్లు తదితర కేడర్లు కూడా పదోన్నతులు పొంతారన్నారు. ఎంతో పారదర్శకంగా, త్వరితగతిన పదోన్నతుల కల్పించినందుకుగాను పంచాయితీరాజ్ శాఖ మంత్రి బుడితి ముత్యాలనాయుడుకి, చీఫ్ సెక్రెటరీ బి.రాజేశకర్‌కు, కమిషనర్‌కు సూర్యకుమారికి ధన్యవాదాలు తెలిపారు.